# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-06-2024** **సమయం : 6.45 గంటలు**

## ముఖ్యాంశాలు

1. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్ కార్యక్రమం ఈ ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో జులై ఒకటో తేదీనే 90 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.**
3. **ప్రజా సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ప్రజా ప్రత్యేక వేదిక ఏర్పాటు చేస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
4. **హైదరాబాద్ సమానంగా వరంగల్ అభివృద్ధికి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు.**
5. **పురుషుల టీ 20 ప్రపంచ కప్ 2024 విజేతగా భారత్ మళ్లీ నిలిచింది.**

==========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన భావాలను దేశ ప్రజలతో పంచుకునే మనసులో మాట మన్ కీ బాత్ 111వ సంచిక ఈ ఉదయం 11 గంటలకు ఆకాశవాణి ద్వారా ప్రసారమవుతుంది. ప్రధానమంత్రిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత జరగనున్న తొలి మన్ కీ బాత్ కార్యక్రమం ఇది.

--------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జులై ఒకటో తేదీనే 90 శాతం పింఛన్లు పంపిణీ చేయాలని ప్రధాన కార్యదర్శి నీరభ్‌కుమార్ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విజయవాడలోని తన క్యాంపు కార్యాలయం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ఆయన నిన్న దృశ్యమాధ్యమం ద్వారా సమీక్ష నిర్వహించారు. జులై 1వ తేదీన 65 లక్షల 18 వేల 496 మందికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా ఇంటింటికీ వెళ్ళి పింఛన్లు అందజేయాలని ఆదేశించారు. ఇందుకోసం 4 వేల 399 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని చెప్పారు.

--------------------------

ప్రజా సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ప్రత్యేక ప్రజా వేదిక ఏర్పాటు చేస్తానని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రతి శనివారం పార్టీ కార్యాలయానికి వెళ్తానని ఇటీవల హామీ ఇచ్చిన నేపథ్యంలో ఆయన నిన్న ఎన్టీఆర్ భవన్‌కు వెళ్లారు. అక్కడే ప్రజల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఇకపై తెలుగు దేశం పార్టీ రాష్ట్ర

కార్యాలయంలోనూ వినతులు స్వీకరిస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

---------------------------

అమరావతి ప్రాంతంలో చేపట్టనున్న ప్రభుత్వ సముదాయాన్ని నోటిఫై చేస్తూ గెజిట్ జారీ చేశారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం అమరావతిలో ప్రభుత్వ భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. 1575 ఎకరాల ప్రాంతాన్ని ఈ మేరకు సీఆర్డీఏ నోటిఫై చేసింది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా జోనింగ్ నిబంధనల ప్రకారం నోటిఫై చేస్తున్నట్లు సీఆర్డీఏ చట్టం సెక్షన్ 39 ప్రకారం నిన్నబహిరంగ ప్రకటనను జారీ చేసింది. రాయపూడి, నేలపాడు, లింగాయపాలెం, శాఖమూరు, కొండమరాజుపాలెం సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాన్ని నోటిఫై చేసినట్లు సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ వెల్లడించారు.

---------------------------

హైదరాబాద్‌తో సమానంగా వరంగల్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చెయ్యాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వరంగల్ పర్యటనలో భాగంగా నగర అభివృద్ధిపై అధికారులతో నిన్న ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. హెరిటేజ్ సిటీగా తీర్చిదిద్దటానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్డుకు భూసేకరణ పూర్తి చేయాలని, దానికి అవసరమైన నిధుల వివరాలు ప్రభుత్వానికి అందించాలని ఆదేశించారు. హైవేలను అనుసంధానిస్తూ వరంగల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఉండేలా చూడాలన్నారు. ఓఆర్ఆర్ నుంచి టెక్స్‌టైల్ పార్కును అనుసంధానించాలని చెప్పారు. స్మార్ట్‌సిటీలో భాగంగా భూగర్భ డ్రైనేజీ అభివృద్ధి చేయాలని, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించిన ఆయన.. డంపింగ్ యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జులై 1వ తేదీన జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మంగళగిరి నియోజకవర్గం పెనుమాకలో ఉదయం 6 గంటలకు ప్రారంభించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అనంతరం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులు, ప్రజలతో ముచ్చటిస్తారు. శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు హాజరుకానున్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ హౌసింగ్ బోర్డు లెక్కల ప్రకారం తెలంగాణ నుంచి సుమారు 5 వేల 170 కోట్ల రూపాయలు రాష్ట్రానికి రావాలని పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ అన్నారు. ఉమ్మడి ఆస్తులకు సంబంధించి సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో ఉన్న కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పురపాలక శాఖకు సంబంధించిన ఉమ్మడి ఆస్తులపై మంత్రి నారాయణ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో నిన్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు అయినా ఉమ్మడి ఆస్తుల విభజన ఇంకా పూర్తి కాలేదని.. వేల కోట్ల రూపాయలు ఆస్తులున్న సంస్థల విషయంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదం కొనసాగుతూనే ఉందని చెప్పారు.

---------------------------

రేషన్ మాఫియాకు కాకినాడ కేంద్రంగా మారిందని ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల

మనోహర్ అన్నారు. పౌరసరఫరాల శాఖపై కాకినాడలో నిన్న నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. కాకినాడ పోర్టు నుంచి ఇతర దేశాలకు రేషన్ సరకులు వెళ్తున్నాయని తెలిపారు. రేషన్ మాఫియా అక్రమాలపై సీఐడీ విచారణ కోరతామన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

---------------------------

విజయవాడ–జగదల్‌పూర్ హైవే విషయంలో కొన్ని మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలో నిన్న ఆయన మీడియాతో మాట్లాడారు. రహదారుల నిర్మాణంలో కేంద్రానికి పలు ప్రతిపాదనలు పెట్టినట్లు చెప్పారు. ఖమ్మం జిల్లాలో కొన్ని గ్రామాల మీదుగా హైవే వెళ్తున్నందున బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరామని తెలిపారు. ఖమ్మం చుట్టూ రింగ్‌రోడ్డు నిర్మాణానికి గతంలోనే ప్రతిపాదనలు చేశామని చెప్పారు. భద్రాచలం పట్టణంలోనూ కొన్ని రోడ్ల విస్తరణకు ఆమోదం లభించిందన్నారు. భద్రాచలం నుంచి ఏటూరు నాగారం వరకు.. జగ్గయ్యపేట నుంచి వైరా, తల్లాడ మీదుగా కొత్తగూడెం వరకు 4 లైన్ల హైవేకి ప్రతిపాదనలు పంపించామని మంత్రి తెలిపారు.

---------------------------

నీట్–యూజీ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో ముందుజాగ్రత్తగా వాయిదా వేసిన నీట్ పీజీ పరీక్షను ఎప్పుడు నిర్వహించేదీ జాతీయ పరీక్షల మండలి రెండ్రోజుల్లో ప్రకటిస్తుందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నిన్న పాత్రికేయులకు తెలిపారు. ఇదిలా ఉండగా నీట్–యూజీ అక్రమాలకు సంబంధించి గుజరాత్‌లో ఏడుచోట్ల కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ నిన్న సోదాలు నిర్వహించింది.

---------------------------

గుంటూరు ప్రభుత్వ బోధనాసుపత్రి జీజీహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అందిస్తామని గుంటూరు ఎంపీ, కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల నిర్వహణకు అవసరమైన వైద్య పరికరాలు, సామగ్రి మొదలుకుని, మౌలిక వసతుల ఏర్పాటు వంటి పనులకు సంబంధించి ప్రాజెక్టు నివేదికలు రూపొందించి రెండు వారాల్లో తనకు అందజేయాలని ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. తొలిసారిగా నిన్న ఆయన జీజీహెచ్‌ను సందర్శించి ఆసుపత్రిలోని సమస్యలపై వైద్యులతో సమీక్షించారు.

---------------------------

కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కేఆర్ఎంబీ ఛైర్మన్‌గా అతుల్ జైన్‌ను నియమిస్తూ కేంద్ర జలశక్తిశాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర జల సంఘంలో పనిచేస్తున్న జైన్‌కు పదోన్నతి కల్పించి.. బోర్డు ఛైర్మన్‌గా నియమించారు. ఇప్పటివరకు ఈ పోస్టులో ఉన్న శివ్ నందన్ కుమార్ ఆదివారం పదవీ విరమణ పొందనున్నారు.

---------------------------

ఇంజినీరింగ్ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ విడుదలైంది. జులై 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ప్రాసెసింగ్ ఫీజు, రిజిస్ట్రేషన్లు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. జులై 4వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన, 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు కోర్సులు, కళాశాలల ఎంపిక కోసం ఐచ్ఛికాల నమోదుకు అవకాశం ఇచ్చారు. 13వ తేదీన ఐచ్ఛికాల మార్పు, 16వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు.

సీట్లు పొందిన అభ్యర్థులు 17వ తేదీ నుంచి 22వ తేదీ లోపు కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. జులై 19వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని కన్వీనర్ నవ్య నిన్న ప్రకటించారు.

---------------------------

పురుషుల టీ 20 ప్రపంచ కప్ 2024 విజేతగా భారత్ మళ్లీ నిలిచింది. బార్బడోస్‌లోని బ్రిడ్జ్‌టౌన్‌లో నిన్న జరిగిన మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. మొదట టీమ్‌ఇండియా 20 ఓవర్లలో 7 వికెట్లకు 176 పరుగులు చేసింది

---------------------------

రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడి ఆసుపత్రుల్లో మెరుగైన వసతులు, వైద్య సేవల్లో ప్రమాణాల పెంపు ప్రాతిపదికన ఎంపికైన నాలుగు ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం నుంచి అవార్డులు వచ్చినట్లు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ వెల్లడించారు. కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ గణ్‌పత్‌రావ్ జాదవ్ నుంచి ఆసుపత్రుల సమన్వయకర్తలు ఈ అవార్డులు స్వీకరించారని నిన్న ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లా పొన్నూరు సీహెచ్‌సీ, విజయనగరం జిల్లా గరివిడి పీహెచ్‌సీ, గుంటూరులోని డ్రైవర్స్ కాలనీ యూపీహెచ్‌సీ, కృష్ణా జిల్లా దొండపాడు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌కు ఈ అవార్డులు వచ్చాయి.

======================